తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శనివారం
14 మార్చి 2026
సంపుటి 03
సంచిక 156
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

# భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యత

- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మోదీ ఆందోళన
- ఇరాన్ అధ్యక్షుడితో ఫోన్‌లో చర్చ
- ఎల్పీజీ కొరతపై వదంతులను ఖండించిన ప్రధాని



**న్యూఢిల్లీ, 13 మార్చి (తరంగాలు ప్రతినిధి):** పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడిన మోదీ, ప్రాంతీయ భద్రత మరియు శాంతి స్థాపనపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ విషయాన్ని ప్రధాని సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, పౌరుల ప్రాణనష్టం, మౌలిక సదుపాయాల విధ్వంసం వంటి అంశాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో నివసిస్తున్న భారతీయుల భద్రత, క్షేమమే భారత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని ప్రధాని స్పష్టం చేశారు. సరకు రవాణా, ఇంధన సరఫరా వంటి అంశాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల ద్వారా రవాణా నిరంతరాయంగా సాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. హింసకు ముగింపు పలికి చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రధాని సూచించారు.

పశ్చిమాసియా దేశాల్లో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో ఇరాన్‌లో సుమారు తొమ్మిది వేల మంది, ఇజ్రాయెల్‌లో నలభై వేల మందికి పైగా భారతీయులు ఉన్నారు. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్‌లో ఉన్న భారతీయుల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే కొంతమంది విద్యార్థులు భారత రాయబార కార్యాలయం సహాయంతో స్వదేశానికి చేరుకున్నారని విదేశాంగ శాఖ తెలిపింది. మిగతా వారిని కూడా సురక్షితంగా తరలించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా దిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ప్రధాని మోదీ దేశంలో ఎల్పీజీ కొరత ఉందంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ పరిస్థితులను అడ్డంగా పెట్టుకుని కొన్ని వస్తువులను అక్రమంగా నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. అలాంటి అక్రమ చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశ ఇంధన భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రధాని తెలిపారు. 2014కి ముందు దేశంలో వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని, ప్రస్తుతం దేశంలో ఐదు మిలియన్ టన్నులకు పైగా వ్యూహాత్మక చమురు నిల్వలు ఉన్నాయని ఆయన చెప్పారు. గత దశాబ్దంలో దేశ శుద్ధి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభాన్ని కూడా దేశం సమర్థంగా ఎదుర్కొంటుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.



## ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణం

**ఆంధ్రప్రదేశ్ న్యాయరంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టం**

**అమరావతి, 13 మార్చి (తరంగాలు ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ న్యాయరంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు మరియు ప్రముఖులు హాజరయ్యారు. జస్టిస్ లిసా గిల్ నియామకం రాష్ట్ర న్యాయ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి. న్యాయరంగంలో ఆమెకు ఉన్న అనుభవం, సేవలను దృష్టిలో పెట్టుకుని ఈ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఈ ఏడాది ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన పదవీ విరమణ అనంతరం జస్టిస్ లిసా గిల్ ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చరిత్రలో తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. ఈ నియామకం ద్వారా ఏపీ హైకోర్టులో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరుగుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో న్యాయ వ్యవస్థలో మరిన్ని సానుకూల మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు.

## డీపీఆర్ లేకుండా చర్యలేమిటి...?



- మూసీ సుందరీకరణపై స్పష్టత కోరిన బీఆర్ఎస్ నేత
- పేదల ఇళ్ల కూల్చివేతపై విమర్శలు
- మూసీ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌కు హరీష్‌రావు 8 ప్రశ్నలు

**హైదరాబాద్, 13 మార్చి (తరంగాలు ప్రతినిధి):** మూసీ బ్యూటిఫికేషన్ అంశంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎనిమిది సూటి ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం మూసీ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ప్రెజెంటేషన్ ఇస్తున్న నేపథ్యంలో ముందుగా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని హరీష్‌రావు అన్నారు. మూసీ పునరుజ్జీవనానికి తమ పార్టీ ఎప్పుడూ

➢ మిగతా 2వ పేజిలో..

## కొత్త పార్టీ పేరును ప్రకటించిన శశికళ

- ఆల్ ఇండియా పురచ్చి తలైవార్ మక్కల్ మున్నేత్ర కజగం స్థాపన
- తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికల్లో పోటీ ప్రకటన
- పార్టీ జెండాలో అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత చిత్రాలు





**చెన్నై, 13 మార్చి(తరంగాలు ప్రతినిధి):** తమిళనాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితకు సన్నిహితురాలు, అన్నాడీఎంకే మాజీ ప్రధాన కార్యదర్శి వీకే శశికళ కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. ఆ పార్టీకి "ఆల్ ఇండియా పురచ్చి తలైవార్ మక్కల్ మున్నేత్ర కజగం" అనే పేరు పెట్టినట్లు ఆమె వెల్లడించారు. ఏఐపీటీఎంఎంకే అనే సంక్షిప్త పేరుతో పార్టీని ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24న రామనాథపురం జిల్లాలోని కాముతి ప్రాంతంలో జరిగిన సమావేశంలో పార్టీ జెండాను శశికళ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. పార్టీ

➢ మిగతా 2వ పేజిలో..

## మహిళలకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవచ్చు

- నెలసరి సెలవులపై చట్టం చేస్తే సమస్యలు: సుప్రీంకోర్టు
- తప్పనిసరి చేస్తే ఉద్యోగాల్లో ఇబ్బందులు
- మహిళలపై వివక్ష పెరిగే ప్రమాదం
- అవగాహన పెంచాలని కోర్టు సూచన



**న్యూఢిల్లీ, 13 మార్చి (తరంగాలు ప్రతినిధి) :** మహిళలకు నెలసరి సమయంలో తప్పనిసరిగా సెలవులు ఇవ్వాలనే చట్టాన్ని అమలు చేస్తే అది మహిళలకే సమస్యలు తెచ్చే ప్రమాదం ఉందని సుప్రీంకోర్టు

➢ మిగతా 2వ పేజిలో..

## మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

- అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీస్ వ్యవస్థలో విశేష సేవలు
- నక్సలిజం అణచివేతలో కీలక పాత్ర



**హైదరాబాద్, 13 మార్చి(తరంగాలు ప్రతినిధి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర (82) కన్నుమూశారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకుంటున్నారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుని ఇంటికి వెళ్లిన అనంతరం బాత్రూంలో పడిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తిరిగి నిమ్స్‌కు తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఆయన ప్రాణాలను కాపాడలేకపోయారు.

1965 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హెచ్‌జే దొర శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డీజీపీగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసి విశేష సేవలు అందించారు. ముఖ్యంగా రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేయడంలో కీలక పాత్ర పోషించి ప్రత్యేక గుర్తింపు పొందారు. జాతీయ స్థాయిలో కూడా పలు కీలక పదవులు నిర్వహించారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా సేవలు అందించారు. 1996లో డీజీపీగా ప్రమోషన్ పొందిన ఆయన తన సుదీర్ఘ సేవా కాలంలో పోలీస్ వ్యవస్థ అభివృద్ధికి కృషి చేశారు. తన వృత్తి జీవిత అనుభవాలను 'జర్నీ త్రూ టర్బ్యులెంట్ టైమ్స్' అనే ఆత్మకథలో పొందుపరిచారు. ఆయన మరణం పోలీస్ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

## ప్రభుత్వానికి ఆర్టీసీ ఉద్యోగుల హెచ్చరిక

- 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ డిమాండ్
- బకాయిల విడుదలపై ఆర్టీసీ జేఏసీ ఆందోళన




**హైదరాబాద్, 13 మార్చి (తరంగాలు ప్రతినిధి) :** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నోటీసులు సమర్పించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు దిగుతామని ఉద్యోగులు హెచ్చరించారు. ఆర్టీసీ ఎండీ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యాలయ పేషీలోనే సమ్మె నోటీసులను జేఏసీ నేతలు సమర్పించారు. అదేవిధంగా లేబర్ కమిషనర్ కార్యాలయంలో కూడా నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆర్టీసీ జేఏసీ నాయకులు వెల్లడించారు. 2021 వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.350 కోట్ల నిధులను కోత లేకుండా ఇవ్వాలని కోరింది. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ.2,500 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్లపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని జేఏసీ నేతలు కోరారు. గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, ఉద్యోగులపై ఉన్న అధిక పనిభారాన్ని తగ్గించాలని కూడా డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెకు వెళ్లక తప్పదని ఆర్టీసీ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

## డీపీఆర్ లేకుండా చర్యలేమిటి...?

➤ మొదటి పేజి తరువాయి

వ్యతిరేకం కాదని హరీష్‌రావు స్పష్టం చేశారు. అయితే సుందరీకరణ పేరిట వేలాది మంది పేదలను నిరాశ్రయులుగా చేయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలోనే మూసీ సుందరీకరణకు శ్రీకారం చుట్టామని, సుమారు నాలుగు వేల కోట్లతో 32 శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. గోదావరి నీటిని తీసుకొచ్చి మూసీని శుద్ధి చేయాలనే ప్రణాళిక కూడా రూపొందించామని పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలి తుగ్లక్ పాలనను గుర్తు చేస్తోందని హరీష్‌రావు విమర్శించారు. ఒకసారి మూసీ సుందరీకరణ, మరోసారి మూసీ ప్రక్షాళన, ఇంకోసారి పునరుజ్జీవం అంటూ పేర్లు మారుస్తూ ప్రజల ఇళ్లను కూల్చే హక్కు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ముందుగా మురుగు నీటి సమస్యను పరిష్కరించాల్సి ఉందని అన్నారు. ఖజానా ఖాళీ అని చెబుతూనే లక్షా యాభై వేల కోట్ల రూపాయల టెండర్లు ఎలా పెట్టారని హరీష్‌రావు ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఫైవ్ స్టార్ హోటళ్లలో కూర్చొని నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. సరైన ప్రణాళికలు, వివరాలు లేకుండా ప్రజల ఇళ్లను కూల్చడం దారుణమని పేర్కొన్నారు.డీపీఆర్ లేకుండానే పేదలకు నోటీసులు ఇవ్వడం ఎలా సాధ్యమైందని హరీష్‌రావు ప్రశ్నించారు. బఫర్ జోన్‌ను ఎలా నిర్ణయించారో స్పష్టత ఇవ్వాలని, వరద నీటి అధ్యయనాలు చేశారా లేదా వెల్లడించాలని కోరారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రుణం మంజూరైందని అసెంబ్లీలో చెప్పిన విషయంపై కూడా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇప్పటికే కూల్చివేసిన ఇళ్లకు సరైన పరిహారం ఇవ్వలేదని హరీష్‌రావు ఆరోపించారు. మధురిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసులకు ఇచ్చిన హామీ మాదిరిగానే మిగతా కాలనీల ప్రజలకు కూడా స్థలాలు ఇస్తారా అని ప్రశ్నించారు. అలాగే మెట్రో స్టేషన్లు, బస్టాండ్లు, దేవాలయాలు వంటి నిర్మాణాలపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో స్పష్టం చేయాలని కోరారు. మూసీ ప్రాంత బాధితులను హౌస్ అరెస్టు చేయడం ఎందుకని ప్రశ్నించిన హరీష్‌రావు, మూసీ పేరిట జరుగుతున్న రియల్ ఎస్టేట్ దందాకు ఎవరు మద్దతు ఇస్తున్నారో వెల్లడించాలని ప్రభుత్వాన్ని నిలదీశారు.

## విద్యార్థుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- **ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల పక్షాన పోరాటం చేయడానికి కూడా వెనుకాడబోను**
- **కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో తీన్మార్ మల్లన్న భేటీ**






వరంగల్, 13 మార్చి (తరంగాలు ప్రతినిధి): కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన విద్యార్థులు, ప్రొఫెసర్లు మరియు ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విద్యార్థి సంఘాల నాయకులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఆయనకు అందజేశారు.విద్యార్థి సంఘాల ప్రతినిధులు యూనివర్సిటీలో ఉన్న వివిధ సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా హాస్టల్ సౌకర్యాల లోపం, మెస్ నిర్వహణలో ఉన్న సమస్యలు, విద్యార్థుల ఉపాధి అవకాశాలు వంటి అంశాలను వివరంగా తెలిపారు. వినతిపత్రాలను స్వీకరించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విద్యార్థుల సమస్యలపై సానుకూలంగా స్పందించారు. విద్యార్థులు లేవనెత్తిన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే ఈ సమస్యలను మండలిలో ప్రస్తావించి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తానని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల పక్షాన పోరాటం చేయడానికి కూడా వెనుకాడబోనని మల్లన్న స్పష్టం చేశారు.

## మహిళలకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవచ్చు

వ్యాఖ్యానించింది. అలాంటి చట్టం అమలు చేస్తే చాలా మంది ఉద్యోగ దాతలు మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి వెనుకాడే అవకాశం ఉందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ పేర్కొన్నారు. మహిళల సంక్షేమం కోసం తీసుకునే నిర్ణయాలు చివరికి వారి అవకాశాలను తగ్గించే పరిస్థితి రాకూడదని ధర్మాసనం తెలిపింది. నెలసరి సమయంలో మహిళలకు తప్పనిసరిగా సెలవులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం తీసుకురావాలని కోరుతూ న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఇలాంటి చట్టాలు తీసుకురావడం వల్ల మహిళల ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. ఉద్యోగాలు ఇచ్చే సంస్థలు మహిళలను నియమించుకోవడంలో వెనకడుగు వేయవచ్చని కోర్టు పేర్కొంది.

మహిళలకు నెలసరి సమయంలో సెలవులు ఇవ్వడం తప్పనిసరిగా చేస్తే వారిలో మానసిక భయాందోళనలు కూడా పెరిగే అవకాశం ఉందని ధర్మాసనం తెలిపింది. దీనివల్ల మహిళలు పురుషుల కంటే తాము బలహీనులమనే భావన కలిగే ప్రమాదం ఉందని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ అంశంపై సమాజంలో సరైన అవగాహన పెంచడం అవసరమని, సున్నితంగా ప్రజలను చైతన్యపరచడం ముఖ్యమని కోర్టు సూచించింది. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఎంఆర్ షంషాద్ కేరళ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రస్తావించారు. కేరళలో విశ్వవిద్యాలయాలకు చెందిన మహిళా విద్యార్థినులకు నెలసరి సెలవులు మంజూరు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అలాగే కొన్ని ప్రైవేట్ సంస్థలు కూడా ఇలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నాయని తెలిపారు. అయితే దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి అలాంటి నిర్ణయాలు ప్రత్యేక పరిస్థితుల్లో తీసుకున్నవని తెలిపారు. కానీ దేశవ్యాప్తంగా తప్పనిసరి చట్టంగా అమలు చేస్తే మహిళల ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవచ్చని పేర్కొన్నారు. అప్పుడు సంస్థలు మహిళలను నియమించుకోవడంలో వెనకడుగు వేయవచ్చని, అది వారి వృత్తి జీవితంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## కొత్త పార్టీ పేరును ప్రకటించిన శశికళ

➤ మొదటి పేజి తరువాయి

చిహ్నంగా కొబ్బరి చెట్ల తోటను ప్రకటించారు. పార్టీ జెండాలో నలుపు, తెలుపు, ఎరుపు రంగులు ఉండగా, దివంగత నేతలు సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, జయలలిత చిత్రాలను కూడా జెండాలో చేర్చినట్లు తెలిపారు.ప్రస్తుతం 71 సంవత్సరాల వయసులో ఉన్న శశికళ త్వరలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈ పార్టీని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తమిళనాడు మరియు పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని ఆమె వెల్లడించారు. తమ పార్టీ చిహ్నం ఐక్యతకు ప్రతీక అని శశికళ అన్నారు. తమ పార్టీ ఒక ఉమ్మడి కుటుంబంలా కలిసి పనిచేస్తుందని తెలిపారు. తమ నాయకుడు ఎంజీ రామచంద్రన్ ఎదుర్కొన్న పరిస్థితులను తాను కూడా ఎదుర్కొంటున్నానని, కార్యకర్తలు ప్రారంభించిన పార్టీలోనే ఆయన చేరి ప్రజల మద్దతు పొందారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో తమ పార్టీ బలంగా ఎదుగుతుందని శశికళ ఆశాభావం వ్యక్తం చేశారు.

## గ్యాస్ అప్‌డేట్ పేరుతో సైబర్ మోసం

- **ఇద్దరు మహిళల ఖాతాల నుంచి నాలుగు లక్షలు మాయం**
- **నకిలీ ఫైల్ పంపించి వివరాలు సేకరించిన నేరగాళ్లు**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**



**డెస్క్, 13 మార్చి (తరంగాలు ప్రతినిధి):** వంట గ్యాస్ కొరత పరిస్థితిని ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఇద్దరు మహిళలను లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు వారి బ్యాంకు ఖాతాల నుంచి సుమారు నాలుగు లక్షల రూపాయలు దోచుకున్నారు. గ్యాస్ కనెక్షన్ వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉందని చెప్పి ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కల్యాణ్-డోంబివ్లి ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మహానగర్ గ్యాస్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులమని పరిచయం చేసుకున్నారు. గ్యాస్ సిలిండర్ కనెక్షన్ వివరాలను నవీకరించుకోవాలని చెప్పి వారి మొబైల్ ఫోన్లకు ఒక ఫైల్ పంపించారు. ఆ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసి తెరవాలని సూచించారు. అంతటితో ఆగకుండా ఒక ఆన్‌లైన్ ఫారమ్ పూరించాల్సిందిగా మహిళలకు సూచించారు. వారు ఆ ప్రక్రియ పూర్తి చేసిన కొద్ది సేపటికే వారి బ్యాంకు ఖాతాల నుంచి సుమారు నాలుగు లక్షల రూపాయలు డెబిట్ అయినట్లు సందేశాలు వచ్చాయి. దీంతో మోసపోయామని గుర్తించిన మహిళలు వెంటనే పోలీసులను ఆశ్రయించారు.

బాధితులు డోంబివ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసు అధికారి సుహాస్ హెమాడే తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్ కొరతపై ప్రజల్లో ఉన్న ఆందోళనను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని ఆయన చెప్పారు. ప్రజలు ఇలాంటి ఫోన్ కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. తెలియని వ్యక్తులు పంపిన ఫైళ్లను డౌన్‌లోడ్ చేయకూడదని, వ్యక్తిగత లేదా బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు.



## ఆర్‌సీసీ ఇళ్లలో అద్దెకు ఉంటున్నారా? అయితే మీకు ఇందిరమ్మ ఇళ్లు లేనట్టే?

- **రాయపర్తిలో 'ఇందిరమ్మ' ఇళ్లకు బ్రేక్: పీడీ ఆఫీసులో నిలిచిన బిల్లులు**
- **అద్దె ఇంట్లో ఉంటే అపరాధమా?పక్కా ఇళ్ల సాకుతో పేదలకు మొండిచేయి చూపుతున్న అధికారులు!**
- **నిబంధనల ఉచ్చులో 'ఇందిరమ్మ' ఇల్లు:**
- **రేకుల షెడ్డు ఉంటేనే బిల్లులా? రాయపర్తిలో లబ్ధిదారుల ఆవేదన**

రాయపర్తి, మార్చి 13, తరంగాలు :పేదల సొంతింటి కలను నిజం చేస్తామని ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం రాయపర్తి మండలంలో అభాసుపాలవుతోంది. క్షేత్రస్థాయిలో అధికారులు అనుసరిస్తున్న వింత పోకడలు, నిబంధనల పేరుతో పెడుతున్న కొర్రీలు లబ్ధిదారులను అప్పుల పాలు చేస్తున్నాయి. ముఖ్యంగా సొంత స్థలం ఉండి, నిలువ నీడ లేక ఆర్‌సీసీ (స్లాబ్) ఇళ్లలో అద్దెకు ఉంటున్న వారిని 'ధనికులు'గా చిత్రీకరిస్తూ వారి బిల్లులను నిలిపివేయడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.?పీడీ కార్యాలయంలో నిలిచిన బిల్లులు:?మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులు ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి పునాదులు, గోడల దశకు చేరుకున్నారు. అయితే, వీరి బిల్లులు ప్రస్తుతం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ ) కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయి పరిశీలనలో లబ్ధిదారులు అద్దె ఇళ్లలో ఉంటున్నారని, ఆ ఇళ్లు పక్కా ఇళ్లు (స్లాబ్) కావడంతో వారు ఈ పథకానికి అనర్హులని అధికారులు కొర్రీలు పెడుతున్నట్లు సమాచారం.

?పేదలపై నిబంధనల భారం:?"సొంత ఇల్లు లేకనే కదా మేము అద్దెకు ఉంటున్నాం.. అద్దె ఇల్లు స్లాబ్‌ది అయితే మాకేం సంబంధం?" అని బాధితులు అధికారులను నిలదీస్తున్నారు. కేవలం రేకుల షెడ్డు లేదా కచ్చా ఇళ్లలో నివసించే వారికే ప్రాధాన్యత ఇస్తామన్న నిబంధనతో, అద్దె ఇళ్లలో తలదాచుకుంటున్న వేలాది మంది పేదలకు అన్యాయం జరుగుతోంది.

### ఆందోళనలో లబ్ధిదారులు:

?ఇల్లు పూర్తవుతుందనే నమ్మకంతో బయట అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు, ఇప్పుడు పీడీ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదు. అధికారులు స్పందించి, వాస్తవ పరిస్థితులను గమనించాలని, కేవలం అద్దె ఇళ్ల సాకుతో బిల్లులు ఆపకుండా వెంటనే విడుదల చేయాలని రాయపర్తి మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రైతులకు సబ్సిడీతో వ్యవసాయ యంత్రాలు అందజేత






- **వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు యంత్రీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యత**
- **వరి పంటతో పాటు వాణిజ్య పంటలు, పాడి--పౌల్ట్రీ వంటి అనుబంధ రంగాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి**
- **రైతులకు సబ్సిడీ యంత్రాల కేటాయింపులో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచన**
- **వర్ధన్నపేట, పర్వతగిరి మండలాలకు చెందిన 27 మంది రైతులకు రోటవెటర్స్, బేలర్స్, స్ప్రేయర్స్ పంపిణీ**
- **డ్రోన్ స్ప్రేయర్లను వ్యక్తులకు కాకుండా రైతు సంఘాలు లేదా మహిళా సంఘాలకు కేటాయించాలి**
- **ఇల్లంద వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు 50శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాగరాజు**

**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 13,తరంగాలు :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం పరిధిలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వర్ధన్నపేట, పర్వతగిరి, వరంగల్ మండలాలకు చెందిన 27 మంది లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీపై రోటవెటర్స్, బేలర్స్, స్ప్రేయర్స్ వంటి వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ యంత్రీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. రైతులపై పెరుగుతున్న ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ యంత్రాలను అందజేస్తోందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యాంత్రిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు.

రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, సన్నాలకు బోనస్, రైతు భరోసా, ఉచిత విద్యుత్, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో సాంకేతిక, యాంత్రిక మార్పులు జరుగుతున్న నేపథ్యంలో రైతులు కూడా ఆధునిక పద్ధతులను అనుసరించాలని సూచించారు.రైతులు వరి పంటతో పాటు ఇతర వాణిజ్య పంటలపై కూడా దృష్టి పెట్టాలని, అలాగే పాడి, పౌల్ట్రీ వంటి అనుబంధ రంగాలను అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వర్ధన్నపేట, పర్వతగిరి, వరంగల్ మండలాలు వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు కావున సబ్సిడీ యంత్రాల కేటాయింపులో ఈ రెండు మండలాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారులను కోరారు. డ్రోన్ స్ప్రేయర్లను వ్యక్తులకు కాకుండా రైతు సంఘాలు లేదా మహిళా సంఘాలకు గ్రామానికి ఒకటి చొప్పున కేటాయించాలని సూచించారు.

ప్రభుత్వాలు రైతుల కోసం ఎంత చేసినా తక్కువేనని, రైతులు పండించిన పంటకు సరైన ధర రావాలని, వ్యవసాయం లాభసాటిగా మారేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఏడీఏవో, ఏవోలు, మున్సిపాలిటీ ఛైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ ఛైర్మన్ నేతావత్ శీభారాణి - రాజేందర్,

సర్పంచులు బేతి సాంబయ్య, పింగిలి నాగమణి, రజాక్ పటాన్ ,కౌడగాని సునీత -రాజేష్ ఖన్నా,ఐనవోలు ఆలయ ఛైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, డైరెక్టర్స్, కౌన్సిలర్లు, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, పర్వతగిరి మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్,వర్ధన్నపేట మండల మహిళా అధ్యక్షురాలు మురుపట్ల అరుణ సాయికుమార్, బ్లాక్ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు తీగల సునీత, ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి లబ్ధిదారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
శనివారం, 14 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## యుద్ధ నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్

• ఖమ్మంలో పెన్షనర్ల ప్రదర్శన ధర్నా




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** భారత ప్రభుత్వం యుద్ధ నివారణ చర్యలు చేపట్టి నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచాలని డిమాండ్ చేస్తూ వందలాది పెన్షనర్లు నగరంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. యుద్ధం వద్దు శాంతి ముద్దు ప్రపంచ శాంతి వర్ధిల్లాలి మానవహననాన్ని ఆపాలి పర్యావరణాన్ని కాపాడాలని పెన్షనర్లు ప్లకార్డులు చేతపట్టి వైరా రోడ్ లోని పెన్షనర్స్ భవన్ నుండి అంబేద్కర్ విగ్రహం వద్దకు ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సుబ్బయ్య టి వేణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల ఉద్యోగ విరమణ ప్రయోజనాలు ఇవ్వకుండా గత రెండు సంవత్సరాల నుండి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న సమయంలో యుద్ధాన్ని ఆసరాగా చూపి నిత్యవసర వస్తువుల ధరలను పెంచడంతో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర ప్రభుత్వం తక్షణమే యుద్ధ నివారణ కు పూనుకోవాలని తద్వారా నిత్యవసర వస్తువుల ధరలను అదుపులో ఉంచాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయిల్ దేశాలు ఏకపక్షంగా ఇరాన్ పై దాడులు నిర్వహించడంతో దాని ప్రభావం భారతదేశంలో పడుతున్నదని బడి పిల్లలు అని చూడకుండా పాఠశాలల మీద బాంబులు వేయటం న్యాయం కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాలు విడుదల చేయాలని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి ఆర్ వెంకట్ నారాయణ, ఉపాధ్యక్షులు ఎస్ పూర్ణచంద్రరావు, కార్యదర్శి టి జనార్దన్ , పి జానయ్య, సీనియర్ నాయకులు సి బాబురావు,తో పాటు ఖమ్మం నగర శాఖ నాయకులు పి బసవరావు, ఆర్ రాధాకృష్ణ ,దొడ్డ రమేష్ ,జి ఆదినారాయణ ,నాగేశ్వరరావు ,సిహెచ్ బాబు, సత్యనారాయణ, వెంకటపతి రాజు, ఆంజనేయులు, పని రాజ్ కుమార్, గోవిందు, మోహన్, దాస్ ,వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, గురవయ్య, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జనాభా గణన సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలి

•వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ ప్రతినిధి,13 మార్చి, తరంగాలు :** 2027 జనాభా లెక్కలు ప్రభుత్వ పథకాల అమలు, దేశాభివృద్ధికి కీలకమని, జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జనాభా గణన--2027 నిర్వహణపై జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో జనాభా గణనను సమర్థమంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.జనాభా గణన కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా (హౌస్‌లిస్టింగ్) మరియు గృహాల గణన నిర్వహించబడుతుందని, తెలంగాణ రాష్ట్రంలో ఈ దశ మే 11, 2026న ప్రారంభమై జూన్ 9, 2026 వరకు కొనసాగుతుంది. రెండవ దశలో జనాభా గణన (పాపులేషన్ ఎన్యుమరేషన్) ప్రక్రియ ఫిబ్రవరి 2027లో నిర్వహించబడుతుందని, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని అన్నారు.ఈసారి జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.మొదటి దశలో నిర్వహించబడే ఇళ్ల జాబితా మరియు గృహాల గణనలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన పదార్థాలు, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు.అదేవిధంగా ప్రతి మండలంలోని రెవెన్యూ గ్రామాలను, పట్టణాల్లోని వార్డులను గణన బ్లాకులుగా ఎలా విభజించాలి, గణన ప్రక్రియను ఎలా నిర్వహించాలి అనే అంశాలపై అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖల అధికారుల బాధ్యతలను వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో జనాభా గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని జనాభా గణన విభాగం హైదరాబాద్‌కు చెందిన సంయుక్త సంచాలకులు డి. సుబ్బరాజు, గణాంక అధికారి ఎస్. సతీష్ మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వై వి గణేష్, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి,సిపిఓ చంద్రకళ, ఆర్డీఓలు సుమా, ఉమారాణి, మునిసిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో మాంగళ్య షాపింగ్ మాల్ 30వ శాఖ ఘనంగా ప్రారంభం





**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** 2012లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటింది. ఈ క్రమంలో ఖమ్మం లో 30 వ శాఖను ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడుతూ వస్త్ర వ్యాపార రంగంలో దశాబ్దాల అనుభవం తో నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ మూడు రాష్ట్రాల ప్రజలకు విశేష సేవలందిస్తున్న మాంగళ్య యాజమాన్యం పిఎన్ మూర్తి, కాసం నమఃశివాయ బ్రదర్స్ కలిసి కృష్ణార్జునుల లాగా వ్యాపారం చేస్తున్నా వారికి మా ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలుపుతూ త్వరలో తమిళనాడు రాష్ట్రంలో విస్తరించనున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత ప్రముఖ సినీ నటి శ్రీలీల ముఖ్య అతిథిగా హాజరై, దీప ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అభిమానులతో సంతోషంగా మమేకమయ్యారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు.

రిబ్బన్ కటింగ్ అనంతరం నటి శ్రీలీల మాట్లాడుతూ...ఖమ్మం ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉంది. వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుందని అన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహ మూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ...ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే మా విజయ రహస్యం అని తెలిపారు.మా స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నాం. అని పేర్కొన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్, అలాగే వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేకమైన భారీ వెడ్డింగ్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ మాల్ ప్రారంభంతో ఖమ్మం జిల్లా ప్రజలు ఇకపై పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చు. రూ.99 నుంచి ప్రారంభమై రూ.1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్ గా ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 9--10 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్‌గా నిలుస్తోంది.ఖమ్మం జిల్లా ప్రజలు తమ తమ శుభ కార్యక్రమం ఏది ఉన్న ఒకసారి మాంగళ్య షాపింగ్ మాల్ కు సకుటుంబ సపరివారంగా విచ్చేసి ఒక నూతన షాపింగ్ ఒరవడి సృష్టించాలని యాజమాన్యం తెలిపింది, ఈ కార్యక్రమంలో డైరక్టర్లు విశాల్, వరుణ్, కార్తిక్, అరుణ్, పనీత్, సాయి కృష్ణ పాల్గొన్నారు.






# ప్రగతి పథంలో పేదల సంక్షేమం




• అభివృద్ధి పనులకు సమాంతర ప్రాధాన్యం
• మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో : తిరుమలాయపాలెం :** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని, సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండు సంవత్సరాల మూడు నెలల కాలంలోనే కేవలం బీరోలు గ్రామానికి రూ. 29.92 కోట్లు మంజూరు చేయడం గమనార్హం. ఇందులో భాగంగా రూ. 2.59 కోట్లతో బీరోలు నుంచి ఏలువారిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ. 64 లక్షలతో ఎస్సీ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి భూమి పూజ చేశారు. అలాగే బంధంపల్లిలో రూ. 5.50 కోట్లతో దమ్మాయిగూడెం నుంచి సోలిపురం రోడ్డు మధ్య నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులు, కల్వర్టుల నిర్మాణం, చెరువు మరమ్మత్తులు వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేశామని వివరించారు. ?ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం సరఫరా, కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలు సామాన్యుడి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 72 వేల ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు భరోసా కల్పించామని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలతో పేదల చెంతకు చేరుతామని ధీమా వ్యక్తం చేశారు. ?ఆకేరు వాగు ముంపునకు గురైన రాకాసితండా బాధితులను మంత్రి పరామర్శించి, వారికి ఇందిరమ్మ గృహాల మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా ప్యాకెట్లను పంపిణీ చేశారు. అంతకుముందు గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి, ఆలయ ధర్మకర్తలను శాలువాలతో సత్కరించారు.



# ఆయుష్ మందుల నాణ్యత, సరఫరాపై లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**న్యూఢిల్లి, మార్చి 13,తరంగాలు** : వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఆయుష్ వైద్య సంస్థల్లో మందుల నాణ్యత, నిరంతర సరఫరాపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. గత మూడు సంవత్సరాల్లో వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుష్ కేంద్రాల్లో మందుల నాణ్యతపై ఎలాంటి తనిఖీలు నిర్వహించారో వివరాలు ఇవ్వాలని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖను ఎంపీ కోరారు.అలాగే ఆయుష్ వైద్య కేంద్రాల్లో సరఫరా అయ్యే మందులపై సంవత్సరం వారీగా చేసిన తనిఖీలు, సేకరించిన నమూనాలు, పరీక్షల ఫలితాలు, నాసిరకం లేదా నకిలీగా తేలిన మందుల వివరాలు తెలియజేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని తయారీదారులు లేదా సరఫరాదారులపై తీసుకున్న చర్యలు --- లైసెన్స్ సస్పెన్షన్, రద్దు, బ్లాక్‌లిస్టింగ్, బకాయిల వసూళ్లు, కేసులు నమోదు వంటి చర్యలపై వివరాలు కోరారు.అదేవిధంగా, ఆయుష్ మందుల కొరత లేకుండా ఉండేందుకు నేషనల్ ఆయుష్ మిషన్ లేదా ఇతర కేంద్ర పథకాల కింద డిజిటల్ స్టాక్ మానిటరింగ్ వ్యవస్థ అమలు చేస్తున్నారా అనే అంశంపై కూడా ఎంపీ ప్రశ్నించారు. దీనికి సమాధానంగా కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్ మాట్లాడుతూ ప్రజారోగ్యం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండే అంశమని తెలిపారు. తెలంగాణలోని వరంగల్ సహా అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రులకు నాణ్యమైన మందుల సరఫరా బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన వివరాల ప్రకారం ఆయుష్ విభాగం ద్వారా మందుల నమూనాలను యాదృచ్ఛికంగా, బ్యాచ్ వారీగా సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నాణ్యత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మందులనే ఆసుపత్రులకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. నాణ్యతలో లోపాలు తేలితే సరఫరాదారులు తమ ఖర్చుతోనే మందులను వెనక్కి తీసుకుని కొత్తవి అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.అలాగే తెలంగాణలో ఈ–ఔషధి డిజిటల్ వ్యవస్థను అమలు చేసి ఆయుష్ మందుల నిల్వలు, సరఫరాను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఆయుష్ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు లేదా వైద్యాధికారులు ఈ వ్యవస్థ ద్వారా మందుల కోసం ఇండెంట్ పెట్టే అవకాశం ఉందని, స్టాక్ వివరాలు ఆన్లైన్లో అందుబాటులో ఉండటంతో అక్రమాలు, కొరతలను నివారించవచ్చని పేర్కొన్నారు.వరంగల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయుష్ వైద్య వ్యవస్థ బలోపేతంపై ఎంపీ డా. కడియం కావ్య నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

# పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



**జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 13,(తరంగాలు** )మండలం లోని షాపెల్లి గ్రామంలో సర్పంచ్ తాళ్లపల్లి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు శిబిరాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.పశువులకు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేయించుకోవాలని సూచించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మమతా రాజు, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొనడం జరిగింది.

# ముగిసిన బీజేపీ శిక్షణా తరగతులు



**ఇల్లందు ప్రతినిధి మార్చి13,( తరంగాలు):** పండిట్ దీన దయాళ్ ప్రశిక్షణా మహా అభియాన్ లో భాగంగా స్థానికి ఆర్యవైశ్య కల్యాణ మండపం లో. జరిగిన పట్టణ,మండల శిక్షణా తరగతులు 12/03/2026 సా 4:30 కి ప్రారంభమై ఈ రోజు సా3:00 లకు ముగిసినవి.7 కాలాంశాలు(సబ్జెక్ట్) ఏడుగురు జిల్లా స్థాయి నాయకులు కార్యకర్తలకు వివరించారు. ముఖ్య కార్యకర్తలు పాల్గొన్న ఇట్టి శిక్షణా తరగతులు ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి జరుగుతూ కార్యకర్తలకు అవగాహన,సబ్జెక్ట్ బోధించడం ఆనవాయితీ గా జరిగే ప్రక్రియ అని ఈ కార్యక్రమం విజయవంతం అయినందుకు, జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్థానిక నాయకులను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో వక్తలు జిల్లా నాయకులు, జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ,రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు మావునూరి మాధవ్,జిల్లా అధికార ప్రతినిధి దోమల మహేశ్వర్,నియోజకవర్గ కన్వీనర్ బాలగాని గోపి కృష్ణ,ఇల్లందు మండల అధ్యక్షులు బట్టు రమేష్, స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెలుగుమట్ల భూదాన్ భూముల్లో మౌళిక వసతుల పనులకు శ్రీకారం





- భూదాన్ ప్లాట్లలో విద్యుత్, త్రాగునీటి సరఫరా ఏర్పాట్లు
- లబ్ధిదారులకు సౌకర్యవంతమైన నివాస వాతావరణం లక్ష్యం
- మోడల్ కాలనీగా తీర్చిదిద్దే లక్ష్యంతో యుద్ధప్రాతిపదికన పనులు

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ఖమ్మం నగరం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లలో మౌళిక వసతుల అభివృద్ధి పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం గృహ స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన సదుపాయాలను కల్పించే దిశగా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్లాట్లలో విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు త్రాగునీటి సరఫరా కోసం పైపులైన్ పనులు ప్రారంభించారు. ఇంటింటికి నల్లా లు ఏర్పాటుచేసి, శుద్ధమైన త్రాగునీరు అందించనున్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఈ పనులను కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో నివసించబోయే లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌళిక వసతులను దశలవారీగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అర్హులైన 311 మంది నిరుపేదలకు ఈనెల 11న రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లు ఇళ్ళ స్థలాల పట్టాలతో పాటు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ నెల 12న 38 మంది లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేసుకోగా, మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని, వెలుగుమట్ల ఒక అందమైన కాలనీగా, రాష్ట్రంలోనే మోడల్ కాలనీగా అన్ని వసతులు ఏర్పాటు చేయనున్నట్లు, ఆ దిశగా పనులు వెంటనే ప్రారంభించనున్నట్లు హామీ ఇచ్చారు. మిగతా లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్, త్రాగునీటి, పిల్లల చదువులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాల వంటి మౌళిక సదుపాయాలను ప్రాధాన్యతగా కల్పించనున్నారు. పనులను పూర్తి నాణ్యతతో, త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు.

# రాష్ట్రంలో ఎలాంటి గ్యాస్ కొరత లేదు




- గ్యాస్ సరఫరాపై వదంతులను నమ్మొద్దు
- ప్రజలు ఎలాంటి భయాందోళన చెందొద్దు
- అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదు ,
- పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హనుమకొండ ప్రతినిధి, మార్చి 13,తరంగాలు** : రాష్ట్రంలో ఎలాంటి ఎల్పిజి గ్యాస్ కొరతలేదని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి రాష్ట్ర పౌరసరఫరాలు, సాగునీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లు,సీపీలు,ఎస్పిలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, అదనపు కలెక్టర్ ఎన్ రవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాలు, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్యాస్ కొరత అంటూ జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని ప్రజలకు సూచించారు. అబద్ధపు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని, గ్యాస్ సరఫరా పై అపోహలు గ్యాస్ సిలిండర్ల పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతోటే ఈ దుస్థితి ఏర్పడిందని అన్నారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులకు, విద్యా సంస్థలతో పాటు ప్రభుత్వ సంస్థలకు, ఆశ్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. అమెరికా–ఇరాన్ కు మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎల్పిజి గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు, వినియోగదారులు ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని, గృహ వినియోగదారులకు సరిపడ సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు. ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72శాతం బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రిలకు,విద్యా సంస్థలకు,వృద్ధాశ్రమలకు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని హెచ్చరించారు. తాజాగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిల్వ చేయడం, అక్రమంగా మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడినందుకు గాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు.ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు, పోలీస్ కమీషనర్లు, ఎస్పీలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి , గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని గ్యాస్ వినియోగదారులకు సూచించారు.అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని, గృహా వినియోగ దారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామని,ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సాగునీరు, వివిధ పంటల సాగు, తదితర అంశాల గురించి కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ యాసంగి ధాన్యం సేకరణ కు గన్నీ సంచులు,ధాన్యం నిల్వలకు తగిన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలలో వరి సాగు పెరిగిందని,పంటల స్థితి గతులు ననుసరించి సాగు నీరు అందిస్తూ వైవిధ్యత పంటలను ప్రోత్సహించాలని అన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆయిల్ పామ్ పంటల సాగు ఆశించిన స్థాయిలో లేదని అన్నారు. కొన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం బాగుందని, మిగతా జిల్లాల్లోనూ ఆయిల్ పామ్ పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఎల్పిజి గ్యాస్, సాగునీరు, ఆయిల్ ఫామ్ పంటలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు.హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్న వారిలో జిల్లా కలెక్టర్ తో పాటు ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సుధీర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, మార్కెటింగ్ అధికారి అనురాధ, మార్క్ ఫెడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటికల సహకారం

•మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ-నాగేశ్వర్ రావు



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి,మార్చి.13, తరంగాలు:**కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లలో భాగంగా శుక్రవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో లక్ష్మీ నగర్ కి చెందిన ఐరోడ్ల దేవేందర్-పులమ్మ ఇందిరమ్మ ఇంటి నిర్మాణా భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కేసముద్రం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ-నాగేశ్వర్ రావు. ఈ కార్యక్రమంలో బండి సుజాత,తోట అఖిల్,స్థానికులు, తదితరులు ఉన్నారు.

# విద్యార్థుల కు పరీక్ష ప్యాడ్స్ పంపిణి

•వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి,వేం చారిటబుల్ ట్రస్ట్,



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,మార్చి. 13, తరంగాలు**
:కేసముద్రం మండల కమిటీ ఆధ్వర్యంలో, కల్వాల మోడల్ స్కూల్, పాఠశాల లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కు రైటింగ్ ప్యాడ్ మరియు పెన్,81 మంది విద్యార్థుల కు పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ, మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మ స్థైర్యం తో ఉండాలని, మానవ ప్రయత్నం లో ఎలాంటి లోపం లేకుండా ఉంటే దానికి ఫలితం అనుకూలంగా ఉంటుందని, సానుకూలంగా, పాజిటివ్ ఆలోచన ధోరణి కలిగి ఉండాలని, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులను గౌరవించాలని సమాజం లో ఉత్తమ పౌరులు గా ఎదగాలి అని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్ పరిమి నవీన్, రావుల మురళి,ఉపసర్పంచ్ పెదగాని రవి, గ్రామపంచాయతీ కారోబారి నాగరాజు, ఉప సర్పంచి, గండి శీను, జయేందర్ ఉపాధ్యాయులు మద్దినేని వీరబాబు, పార్థసారథి, యాకయ్య , రమేష్, దుర్గాప్రసాద్, శ్రీదేవి, హెల్త్ కేర్, ప్రవళిక, నరసయ్య, సోమయ్య, చంద్రశేఖర్, చంద్రమోహన్, విద్యార్థులు, కమిటీ సభ్యులుసభ్యులు పాల్గొన్నారు.

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

• ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవల్ ఆఫీసర్‌ను నియమించాలి
• రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**వరంగల్ ప్రతినిధి,13 మార్చి, తరంగాలు :** ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, ప్రతి పోలింగ్ స్టేషన్ కు బూత్ లెవెల్ ఆఫీసర్ ను నియమించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాదు నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్ లో సహాయకులుగా నియమించి ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏ ఈ ఆర్ ఓ లు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జరిగేలా పకడ్బందీగా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి బూతు స్థాయి ఏజెంట్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆర్డీవో ను ఆదేశించారు. తహసిల్దార్లు మ్యాపింగ్ లో ఎలాంటి పొరపాటులకు తావునీయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ విసిలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవోలు సుమా, ఉమారాణి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.




# అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

• డిసిసిబి మల్లిబాబు యాదవ్

• అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలోమంత్రి పొంగులేటి



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** కామేపల్లి మండలంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమశీ, బీటీ రోడ్డు ప్రారంభోత్సవాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమాల లాంటి పలు అభివృద్ధి కార్యక్రమాలలో శుక్రవారం నాడు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి ప్రధాన అనుచరుడు,మాజీ జెడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ఆధ్వర్యంలో పండితాపురం పశువుల సంత నుండి మధ్యాహ్నం 12 గంటలకు భారీ బైక్ ర్యాలీ జరిగింది. మొదట మల్లిబాబు యాదవ్ ఇంటిలో ఏర్పాటుచేసిన తేనెటీ విందు కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, రాం రెడ్డి చరణ్ రెడ్డి, షేక్ పతే మహమ్మద్, ధనియాకుల హనుమంతరావు,గింజల నర్సిరెడ్డితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ఇందిరమ్మ రాజ్యంలో పేదలను గుర్తించి వారి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాన్ని చూసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని, ప్రతి పేదవాడికి పథకాలు



అందేటంతవరకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటానని, ఇచ్చిన మాట తప్పుకోవడం జరగదని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ ధరావత్ అనురాధ, రాశీ రెడ్డి జగన్నాథ్ రెడ్డి ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ధరావత్ లాలు నాయక్, ఎస్.కె రబ్బానీ పాషా గుజ్జర్లపూడి రాంబాబు తోటకూరి శివయ్య, విట్టా శీను, చింటూ, పరిమిశెట్టి సాంబయ్య గుగులోతు రవి జక్కంపూడి వెంకటేశ్వర్లు, మేకల లక్ష్మీనారాయణ, పాటిబండ్ల ప్రసాద్ బాదావత్ నాగరాజు చల్ల మల్లయ్య బండి ఎల్లయ్య, బండి ఉపేందర్ దేరంగుల తిరపయ్య, జన్నారపు లింగయ్య,శీలం పుల్లయ్య దనియాకుల మాధవరావు మొగిలి శ్రీను, అయితన బోయిన విట్టల్ రావు, ఇమ్మడి రామనాథం గోపిరెడ్డి, ఏపూరి మల్లయ్య బొడ్డు లక్ష్మీనారాయణ, కోలా వెంకటేశ్వర్లు రాందాస్, గబ్రు నాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు, మద్దినేని రమేష్ బాబు, మంద నాగేశ్వరరావు, నల్లమోతు లక్ష్మయ్య, అధికారులు సర్పంచులు అనధికారులు, మాజీ ఎంపీటీసీ లు, ప్రజాప్రతినిధులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# భద్రకాళి ఆలయాన్ని జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం





• రూ.16.10 కోట్లతో పూడిక తీత పనుల ప్రారంభం
• మే 15 లోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
• భద్రకాళి చెరువు పూడికతీత పనులను ప్రారంభించిన
• ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హన్మకొండ ప్రతినిధి,13 మార్చి, తరంగాలు** :భద్రకాళి ఆలయాన్ని జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వరంగల్ (పశ్చిమ) ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ లు అన్నారు .99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా భద్రకాళి సుందరీకరణ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు కలెక్టర్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్, కలెక్టర్ లు టెంకాయ సమర్పించి పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భం గా శాసనసభ్యులు మాట్లాడుతూ వరంగల్ నగర అభివృద్ధిలో కీలకమైన భద్రకాళి చెరువు పునరుద్ధరణ చేసి మరో పర్యాటక కేంద్రం గా తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టామని, గతంలో రూ. 9 కోట్ల అంచనా వ్యయం తో ప్రారంభించిన పూడికతీత పనులు పూర్తి స్థాయిలో జరగకపోవడంతో ప్రస్తుతం రూ.16.10 కోట్ల నిధులతో సమగ్రంగా చెరువు పూడికతీత పనులను చేపడుతున్నామని అమ్మవారి ఆశీస్సులతో ఎలాంటి అవాంతరాలు లేకుండా చెరువు పునరుద్ధరణ, మాఢ వీధుల నిర్మాణ పనులు చేపడుతున్నామని,అభివృద్ధి పనులలో ఎక్కడ రాజీ పడడం లేదని,సమష్టి నాయకత్వంతో వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. భద్రకాళి చెరువు సుందరీకరణ ప్రక్రియ లో భాగంగా ఆలయం నుంచి బండ్ వైపు గ్లాస్ వంతెన ఏర్పాటు చేసే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, దేశం నలుమూలల నుండి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ ప్రాంతాన్ని ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, గతంలో 70 ఏళ్ల క్రితం పూడికతీత పనులు జరిగాయని గుర్తు చేసిన ఎమ్మెల్యే భద్రకాళి చెరువు పునరుద్ధరణ పనులు ప్రస్తుత ప్రభుత్వ హయాం లో జరగడం తాను ప్రాతినిధ్యం వహించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఇట్టి పనులను మే 15 లోగా సుమారు 7 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తీత పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ లు దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, మామిండ్ల రాజు, ఇరిగేషన్ ఎస్ ఈ రాంప్రసాద్, ఈ ఈ కిరణ్ కుమార్ కుడా ఈ ఈ భీమ్ రావు, ఇరిగేషన్ డి ఈ మధుసూదన్, ఏ ఈ లు వేణు గోపాల్,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
శనివారం, 14 మార్చి, 2026


## ఒక్క వాట్సాప్ మెసేజ్ తో వెంటనే స్పందించిన 20 వార్డ్ కౌన్సిలర్ చిమ్ముల లలిత శ్రీకాంత్ రెడ్డి





**కల్వకుర్తి.మార్చి13 తరంగాలు ప్రతినిధి**

కల్వకుర్తి పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీ 20వ వార్డులో రెండు మూడు నెలల నుంచి మురికి కాలువ తీయకపోవడంతో మురికి పేరుకుపోయి దుర్వాసన రావడం జరిగింది.అలాగే ఇండ్లలోకి విష కీటకాలు దోమలు వస్తున్నాయని 20 వార్డు కౌన్సిలర్ చిమ్ముల లలిత శ్రీకాంత్ రెడ్డి కి వాట్సాప్ చేయగా వెంటనే స్పందించిన ఆయన కల్వకుర్తి మున్సిపల్ సిబ్బందితో స్వయంగా ఇంద్రానగర్ కాలనీ రోడ్ నెంబర్ 4లో వచ్చి దగ్గరుండి మురికి కాలువ ను కల్వకుర్తి మున్సిపల్ సిబ్బందితో క్లీన్ చేయించడం జరిగింది. అలాగే ఈరోజు సాయంత్రం లేదా రేపు బ్రేకింగ్ పౌడర్ చల్లించడం జరుగుతుందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ఇంద్రానగర్ కాలనీ 20వ వార్డు కాలనీవాసులు మాట్లాడుతూ ఉగాది. రంజాన్ మాసంలో మురికి కాల్వ సమస్య ఉందని వాట్సప్ ద్వారా సమస్యను దృష్టికి తీసుకెళ్తే అట్టి సమస్యను తక్షణమే పరిష్కరించిన 20 వార్డ్ కౌన్సిలర్ చిమ్ముల లలిత శ్రీకాంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు



## మానవత్వాన్నిచాటుకున్న మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మట్ట భరత్ గౌడ్



**కల్వకుర్తి.మార్చ్ 13 తరంగాలు ప్రతినిధి**

వెల్దండ మండల కేంద్రంలో మహబూబ్ నగర్ జిల్లా ఐజ మండలం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన ఈడిగ లచ్చ గౌడ్ తన పర్సును పోగొట్టుకున్నాడు.అందులో5000రూపాయలతో పాటు తన ఆధార్ డ్రైవింగ్ లైసెన్సు పాన్ కార్డు ఓటర్ ఐడి కార్డు ఉన్నాయి.ఈ పర్సు యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భరత్ గౌడ్ కు దొరకడంతో వెంటనే పర్సు నా దగ్గర ఉందని వెంటనే వాట్సాప్ గ్రూప్ లలో షేర్ చేశాడు బాధితుడు లచ్చ గౌడ్ మండల కేంద్రానికి విచ్చేసి భరత్ గౌడ్ ను సంప్రదించి దొరికిన పర్సును లచ్చ గౌడ్ కు అందజేశారు పోయిందన్న పర్సును మళ్ళీ తనకు అందించిన భరత్ గౌడ్ కు లచ్చ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు మానవత్వం చాటుకున్న భరత్ గౌడును పలువురు ప్రశంసించారు ఈ కార్యక్రమంలో, బడక రామకృష్ణ, బజ్జ కోటి, మట్ట శేఖర్, భయ్యా మధు, పుట్ట శివ,

# సుదిమళ్ళ పంచాయతీని సందర్శించిన రూరల్ డెవలప్మెంట్ డిప్యూటీ కమిషనర్





**ఇల్లందు ప్రతినిధి మార్చి13,( తరంగాలు):** ఈరోజు ఇల్లందు మండలం సుదిమళ్ళ గ్రామ పంచాయతీ నందు, తెలంగాణ పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ డిప్యూటీ కమిషనర్ విద్యులత 99 రోజుల ప్రజా పాలన లో భాగంగా సదిమళ్ళ గ్రామ పంచాయతీ నీ సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రణాళికను గ్రామపంచాయతీలో సమర్థవంతంగా నిర్వహించాలని.ఇట్టి కార్యక్రమాలలో లైన్ డిపార్ట్మెంట్ అధికారులు,ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలందరూ పాల్గొని గ్రామాన్ని పచ్చదనం, పారిశుద్ధ్యం ను పకడ్బందీగా నిర్వహించాలని తెలియజేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు భవనాల కొరకు పది లక్షల రూపాయలను మంజూరు చేస్తుందని తెలిపారు. ఆశలు,అంగన్వాడీలు గ్రామపంచాయతీలో చేసిన సేవలను కొనియాడారు.గ్రామ పంచాయతీ ప్రజలందరూ మిషన్ భగీరథ నీటిని తాగునీటి కొరకు వినియోగించాలని తెలియజేశారు. అనంతరం గ్రామ ప్రజలు తో కలిసి ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలందరితో కలిసిరైతు వేదుకలో శ్రమదానం నిర్వహించారు.అనంతరం మహిళ పరిశుద్ధ కార్మికులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంజ సుగునయ్య, జిల్లా పరిషత్ డివై సీఈఓ చంద్ర శేఖర్, డి.ఎల్. పి. ఓ ప్రభాకర్, ఎంపీడీఓ ధన్సింగ్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ పద్మావతి,ఎంపీవో చిరంజీవి,మిషన్ భగీరథ ఏఈ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి అజహర్,వార్డు సభ్యులు, ఆశలు, అంగన్వాడీ లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గ్యాస్ సరఫరాలో ఏలాంటి ఇబ్బందులు లేవు డిమాండ్‌కు అనుగుణంగా లభ్యత

- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్,
- గ్యాస్ సరఫరాలో అసత్య ప్రచారాలను నమ్మవద్దు, తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు,
- జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మార్చి.13, తరంగాలు:** శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్,అదనపు కలెక్టర్ రెవెన్యూ అనిల్ కుమార్, సివిల్ సప్లై, గ్యాస్ డీలర్స్, విద్యాశాఖ, హాస్పటల్ సంబంధిత అధికారులతో కలిసి గ్యాస్ సరఫరా పై జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్,సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం (11) ఏజెన్సీల పరిధిలో 2,12131 గ్యాస్ కనెక్షన్లు కలవని, గతవారం రోజుల నుండి పైన తెలిపిన 11 గ్యాస్ ఏజెన్సీల ద్వారా 13985 సిలిండర్ల వినియోగదారులకు పంపిణీ చేయడం జరిగిందని, డిమాండ్ కు అనుగుణంగా సంబంధిత ఏజెన్సీల వద్ద వినియోగదారులకు సరిపడా గ్యాస్ సిలిండర్లు నిల్వలో సిద్ధంగా ఉన్నాయన్నారు, అనవసరంగా ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని, డిమాండ్ కనుగుణంగా గ్యాస్ లభ్యత ఉందని, తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. సివిల్ సప్లై విజిలెన్స్ కమిటీ సభ్యులు నిత్యం గ్యాస్ డీలర్ల వద్ద ఉన్న స్టాకును గమనిస్తూ ఉండాలని వినియోగదారులతో పాటు ఆసుపత్రులకు, విద్యాసంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు గ్యాస్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. హోటళ్ళు, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ డెలివరీ చేసే సమయంలో డెలివరీ బాయ్ కి ఓటీపీ చెప్పి సహకరించాలని, వారి విధులకు ఎవరైనా ఆటంకము కలిగించినట్లయితే, అలాంటి వినియోగదరులపైన కూడా చట్టపరముగా చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ఎల్పీజీ వినియోగదారులు తప్పనిసరిగా కేవైసీ పూర్తి చేసుకోవాలని, గ్యాస్ ఏజెన్సీల వద్ద, ఆన్లైన్లో కానీ గ్యాస్ కంపెనీ అధికారిక వెబ్సైట్ లేదా యాప్ లో, గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద కేవైసీ పూర్తి చేసుకోవచ్చని సూచించారు.జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు లేవని సోషల్ మీడియా వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఏట్టి పరిస్థితిలలో అలాంటి వార్తలను నమ్మ వద్దని తెలిపారు, ప్రభుత్వం సూచించిన ప్రకారం 25 రోజుల అనంతరం మాత్రమే గ్యాస్ బుక్ చేసుకోవాలని, గ్యాస్ సరఫరా చేసే వాహనాలను సిబ్బందిని ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని ఎస్పీ తెలిపారు,ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై అధికారి రమేష్, డి.ఎస్.పి తిరుపతిరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, దేశీ రామ్ నాయక్, వెల్ఫేర్ అధికారిని సబిత, సంబంధిత అధికారులు, గ్యాస్ డీలర్ల సంఘం ప్రెసిడెంట్ నిరంజన్ రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో అంగన్వాడీ,ఆశా వర్కర్ల కోసం నిధులు పెంచాలి






- ఎన్నికల మేనిఫెస్టో హామీ ఇచ్చిన 18 వేలు వేతనాలు చెల్లించాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేత

**ఇల్లందు ప్రతినిధి మార్చి 13,( తరంగాలు):** ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసే కృషి చేస్తున్న అంగన్వాడీ, ఆశా వర్కర్లు తమ వేతనాలు పెంచాలని, దశలవారిగా పోరాడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు కావున కనీసం రేపు జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా తమ విభాగాలు,నిధులు పెంచాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ ఇల్లందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో అంగన్వాడీ, ఆశా వర్కర్లు క్యాంపు కార్యాలయ సిబ్బంది వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అంగన్వాడీ టీచర్స్ అండ్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఈసం వెంకటమ్మ,ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఉపాధ్యక్షులు వజ్జ సుశీల పాల్గొని మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్కీమ్ వర్కర్ల తో వెట్టి చాకిరీ చేయిస్తూ తమకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని వారన్నారు,ఈ బడ్జెట్ లో అంగన్వాడీ ఆశా వర్కర్లకు నిధులు పెంచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాపితంగా ఎమ్మెల్యే లందరికీ వినతులు ఇస్తున్నామని. ఎమ్మెల్యే లు ఈ బడ్జెట్ లో అంగన్వాడీ ఆశాలకు నిధులు,వేతనాలు పెంచేలాగా కృషి చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో అబ్దుల్ నబి, కే.మరియా, ఏ. అరుణ, పీ సారమ్మ,రాణి,ఉమాదేవి,దేవేంద్ర, రాంబాయి, ఆలేటి సంధ్య, కుమారి,ఆదిలక్ష్మి, విజయ లక్ష్మీ,తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలపై కలెక్టర్ అంకిత్ ఫోకస్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, మార్చి 13,తరంగాలు:**రోగులకు మెరుగైన వైద్య సేవలపై కలెక్టర్ అంకిత్ ఫోకస్ పెట్టారు.కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, ఔషధాల లభ్యత, వైద్య సిబ్బంది విధులు మరియు పరిశుభ్రత నిర్వహణపై కలెక్టర్ సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఔషధాల నిల్వ గదిని పరిశీలించిన కలెక్టర్ అక్కడ ఉన్న మందుల స్టాక్‌ను తనిఖీ చేశారు. మందుల గడువు తేదీలను ప్రత్యేకంగా పరిశీలిస్తూ గడువు ముగిసిన మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ రోగులకు ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం అవుట్ పేషంట్ విభాగాన్ని సందర్శించిన కలెక్టర్ రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద ఉన్న క్యూ లైన్లను పరిశీలించారు. రోజూ ఆసుపత్రికి వచ్చే ఓపి రోగుల సంఖ్యపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులు ఎక్కువసేపు వేచి ఉండకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా నిర్వహించాలని సూచించారు.ఓపి విభాగంలో ఉన్న రోగులతో కలెక్టర్ మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. వైద్య సేవల విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైతే వెంటనే ఆసుపత్రి అధికారుల దృష్టికి తీసుకురావాలని రోగులకు సూచించారు.రోగులకు సమయానికి వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, ఆర్‌సిఓ డాక్టర్ చైతన్య, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్తుకు వేం కుటుంబం మద్దతు





- కేసముద్రం మండలం ఉప్పరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక సహాయం

**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మార్చి.13, తరంగాలు**

:మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల భవిష్యత్తు కోసం వేం కుటుంబం ఆదర్శంగా నిలిచింది. వారి కుటుంబం సభ్యులు వేం పురుషోత్తం రెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనవళ్లు వేం అర్ణవ్ కృష్ణ రెడ్డి, అవ్యాన్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూ. 10,000 విరాళం అందించారు.ఈ విరాళం ద్వారా గత రెండు నెలలుగా ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 10వ తరగతి ప్రత్యేక తరగతులు లో విద్యార్థులకు ప్రతి రోజు స్నాక్స్, పరీక్షలకు అవసరమైన ప్యాడ్లు, పెన్నులు వంటి విద్యా సామగ్రి అందజేశారు .


ఈ సహాయం విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం కావడంలో మేలు చేస్తోంది మరియు వారి చదువులో ఆసక్తిని పెంచుతోంది.అని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. అని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు విద్యార్థులు ఈ సహాయం వల్ల మరింత ఉత్సాహంగా చదువుతున్నారు. పరీక్షలకు అవసరమైన సామగ్రి అందినందున, వారు భయంకరంగా భావించకుండానే సులభంగా సన్నద్ధం అవుతున్నారు."ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులు కూడా తమ ఆనందాన్ని, కృతజ్ఞతను వ్యక్తం చేశారు. వారు చెప్పారు ఇలాంటి మద్దతు వల్ల మనం చదువులో మరింత ఫోకస్ అవుతాం. భవిష్యత్తుకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది."గ్రామస్థుల, ఉపాధ్యాయుల అభినందనలువిద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధి కోసం ముందుకు వచ్చి చేసిన వేం కుటుంబ సేవను గ్రామస్థులు, ఉపాధ్యాయులు ప్రశంసించారు. వారు అభిప్రాయపడ్డారు:ఇలాంటి సహాయాలు విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంచుతాయి మరియు భవిష్యత్తులో విజయం సాధించడానికి ప్రేరణగా నిలుస్తాయి."అని తెలిపారు విద్యార్థుల చదువును ముందుకు తీసుకెళ్లడానికి వేం కుటుంబం చేసిన సేవ విద్యార్థుల కు గుర్తు ఉండిపోతుంది ప్రతిరోజూ ప్రత్యేక తరగతులకు స్నాక్స్ అందించడంపరీక్షలకు అవసరమైన ప్యాడ్లు, పెన్నులు పంపిణీవిద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడంఈ విధమైన సహాయం ద్వారా విద్యార్థులు చదువులో మరింత ఫోకస్ అవుతారు, పరీక్షలకు సన్నద్ధమవుతారు మరియు భవిష్యత్తులో విజయం సాధించడానికి సులభతరం అవుతారు. వేం కుటుంబం చేసిన ఈ సేవ ప్రత్యేకంగా గుర్తింపు పొందదగినది ఉప్పరపల్లి గ్రామస్తులు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు తెలిపారు.

# కాంగ్రెస్,బిజెపిలకు వణుకు పుట్టిస్తున్న ఉప్పలచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



**కల్వకుర్తి,మార్చ్13, తరంగాలు ప్రతినిధి**:తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల బాలమణి ఇంటి నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇండ్ల నిర్మాణంలో భాగంగా పూర్తి గోడల నిర్మాణానికి ఇటుకఇప్పించడంజరిగింది.ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ కాంగ్రెస్.బిజెపి.పార్టీలు చేయలేని పనులను తన ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్ నుండి కి ఎంతోమంది నిరుపేదల ఇండ్ల నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తున్నారని అలాంటి గొప్ప వ్యక్తి కల్వకుర్తి ఎమ్మెల్యేగా చూడాలన్న కోరిక తమకు ఉందని తమ ఇంటి నిర్మాణానికి సహాయం చేసిన ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్.మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య, ఉప సర్పంచ్ కోటీశ్వర్ వార్డు మెంబర్స్ కుమార్, మల్లీశ్వరి జంగయ్య, నాయకులు శ్రీను, శేఖర్.తదితరులు పాల్గొన్నారు

# గ్యాస్ సరఫరాపై అపోహాలొద్దు




- ఎలాంటి భయాందోళనకు గురి కావొద్దు
- బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదు
- అపోహలను అడ్డు పెట్టుకుని బ్లాక్ చేస్తే ఉపేక్షించేది లేదు.
- చర్యలు కఠినంగా ఉంటాయి.
- జిల్లాలో సమన్వయ కమిటీలతో తక్షణం సమావేశం ఏర్పాటు చెయండి
- రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**వరంగల్ ప్రతినిధి,13 మార్చి, తరంగాలు** : గ్యాస్ కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని, గ్యాస్ సరఫరా పై అపోహలు నమ్మవద్దని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గ్యాస్ సిలిండర్ల పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతోటే ఈ దుస్థితి ఏర్పడిందని,

గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులకు, విద్యా సంస్థలతో పాటు ప్రభుత్వ సంస్థలకు, ఆశ్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ పర్యవేక్షణ జరుగుతుందని మంత్రి తెలిపారు.అమెరికా-ఇరాన్ కు మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్టా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు.ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72% బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతోపాటు ఆసుపత్రిలక ు,విద్యాసంస్థల కువృద్దాశ్రమలకు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు.రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు.ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు.

అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు.

తాజగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం,అక్రమంగా మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు గాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు.ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు,ఎస్.పి లు,పోలీస్ కమీషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆయన సూచించారు.పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి , గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు.అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని, గృహా వినియోగ దారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామని, ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ యాసంగి ధాన్యం సేకరణ కు గన్నీలు,ధాన్యం నిల్వ కు స్పేస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.జిల్లాలలో వరి సాగు పెరిగిందని,పంటల స్థితి గతులు ననుసరించి సాగు నీరు అందిస్తూ వైవిధ్యత పంటలను ప్రోత్సహించాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.సంధ్యారాణి, డిసిపి అంకిత్ కుమార్ లతో పాటు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## మాడురి కోమల చిత్రపటానికి ఎమ్మెల్యే నాగరాజు నివాళి



**ఐనవోలు, మార్చి 13,తరంగాలు** :మాడురి కోమల చిత్రపటానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు నివాళులర్పించారు. హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం పంతిని గ్రామానికి చెందిన మాడురి రాజు తల్లి మాడురి కోమల ఇటీవల మరణించింది.శుక్రవారం ఆమె దశదిన కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట ఐనవోలు ఆలయ ఛైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, సర్పంచ్ పోలేపల్లి శివ శంకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట్ట మహేష్ గౌడ్, గ్రామ కాంటెస్ట్ సర్పంచ్ బండి మహేందర్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాకర సాంబయ్య, మహిళ అధ్యక్షురాలు ఇల్లందుల ఎలీషా, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పశుసంపద పెంపుకు రైతులు ముందుకు రావాలి

- పశుసంపదను రక్షించేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉచితంగా ఎఫ్ఎండి టీకాలు
- రైతులు పాడి సంపదను పెంచి పాల ఉత్పత్తి పెంచాలి
- పంతిని గ్రామంలో పశువులకు ఉచిత ఎఫ్ఎండి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజుఐనవోలు,



**13 మార్చి, తరంగాలు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం పంతిని గ్రామంలోని పశువుల వైద్యశాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం నిర్వహిస్తున్న ఉచిత ఎఫ్ఎండి టీకాల కార్యక్రమాన్ని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పశు సంపదను పెంచడం, పశువులను వ్యాధుల నుండి రక్షించడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎఫ్ ఎం డి టీకాలను ఉచితంగా వేస్తున్నామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. పాడి పంట వ్యవసాయానికి అనుబంధంగా ఆవులు, బర్రెల పెంపకం చాలా కాలంగా కొనసాగుతోందని, రైతులు పాడి సంపదను పెంచి పాల ఉత్పత్తిని అధికం చేయాలని కోరారు.నా సతీమణికి పశువులపై ఎంతో మక్కువ ఉందని, తాను ఎమ్మెల్యే అయ్యే ముందు సుమారు 50కు పైగా బర్రెలు, ఆవులతో ఒక ఫామ్ నిర్వహించామని తెలిపారు. పిల్లలు కల్తీ పాలకు దూరంగా ఉండి మంచి పాలు అందించాలనే ఉద్దేశంతో పశువుల పెంపకం చేపట్టామని చెప్పారు. అయితే ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో తగినంత సమయం కేటాయించలేక ఆ ఫామ్‌ను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. త్వరలోనే డాక్టర్ల మరియు నిపుణుల సలహాలతో మళ్లీ ఫామ్ ఏర్పాటు చేసి పిల్లలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పాలు అందించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉండే విధంగా ఆవులు, బర్రెల కొనుగోలుకు ప్రభుత్వం సహకరిస్తోందని ఎమ్మెల్యే నాగరాజు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి సంపదను పెంపొందించడంలో రైతులు భాగస్వాములు కావాలని సూచించారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అనంతరం గ్రామ నాయకులు గ్రామ పంచాయతీ, పశువుల వైద్యశాల కు కాంపౌండ్ హాల్, మరియు మహిళా భవన నిర్మాణం కోసం కృషి చేయాలని కోరాగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి వాటిని పరిశీలించి మంజూరూ చేస్తాను అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంతిని గ్రామ సర్పంచ్ శ్రీ రామ్ భూపాల్, నర్సింహులగూడెం గ్రామ సర్పంచ్ పోలేపల్లి శివ శంకర్ రెడ్డి, ఐనవోలు ఆలయ ఛైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట్ట మహేష్ గౌడ్, గ్రామ కాంటెస్ట్ సర్పంచ్ బండి మహేందర్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాకర సాంబయ్య, మహిళ అధ్యక్షురాలు ఇల్లందుల ఎలీషా, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారీ రాధాకృష్ణ, పశుసంవర్ధక శాఖ అధికారులు మండల, గ్రామ నాయకులు మరియు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల మొహంలో చిరునవ్వు





- పేదల సొంతింటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం
- మాటలు చెప్పడం కాదు చేసి చూపడటమే మా ప్రజా ప్రభుత్వ ధ్యేయం
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సింగారపు అరుణ వెంకటేష్ ల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

**హన్మకొండ ప్రతినిధి,13 మార్చి, తరంగాలు** : ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల మొహంలో చిరునవ్వు కనిపిస్తుందని, దానికి సొంత ఇంట్లోకి వచ్చిన చిన్నారుల చిరునవ్వే సాక్ష్యం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ పరిధి లోని తరాలపల్లి గ్రామానికి చెందిన సింగారపు అరుణ - వెంకటేష్ దంపతులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం నుంచి కేటాయించిన రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఆ నివాసానికి శుక్రవారం రోజున కొత్త ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యతిధిగా పాల్గొని గృహ ప్రవేశం చేసి వారి కుటుంబానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన సింగారపు అరుణ - వెంకటేష్ దంపతులకు నూతన వస్త్రాలు పెట్టి ఆశీర్వదించారు.ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు తమ గృహ ప్రవేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాగరాజు కు శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని అన్నారు.గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని చెప్పి పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నిజమైన న్యాయం జరుగుతోందని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే నాగరాజు ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కర్ర హరీష్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎం.డి బషీర్, డివిజన్ నాయకులు నర్మెట్ట వెంకటరమణ గౌడ్, సదానందం, శ్రీనివాస్ రెడ్డి, నీలం రజినీ, గుర్రం జ్యోతి బస్కె ప్రణయ్, కృష్ణ తో పాటు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహానికి భూమి పూజ కార్యక్రమం



- ఆ మహనీయుని అడుగు జాడలో నడవాలి
- మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి పిలుపు

**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మార్చి. 13, తరంగాలు** :కాట్రపల్లి గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేసముద్రం మండల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి పాల్గొని అంబేద్కర్ విగ్రహా ఏర్పాటుకు , భూమి పూజ కార్యక్రమంలో కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాట్రపల్లి గ్రామంలో ఎన్నో రోజుల నుండి కష్టపడి అంబేద్కర్ విగ్రహ ని ఏర్పాటు చేసుకోవాలని ఆకాంక్షతో ముందుకు వెళుతున్న యువత స్ఫూర్తిదాయకం అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు చేసుకొని ఆ మహనీయుడిని నిత్యం స్మరించుకుంటూ భావితరాలకు ఆయన ఆశయాలను స్ఫూర్తిగా నిలిపేందుకు సంకల్పించినందుకు కాట్రపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులను అభినందించారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించి ఈ దేశ ప్రజల భవిష్యత్తుకు బాటలు వేశారనీ, కనుక ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని గౌరవించాలి కాపాడుకోవాలని కోరారు. సమాజంలో అందరూ సమానమే అంటూ సామాజిక పోరాడిన వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని వారిని కొనియాడుతూ ఆయన జీవితంలో ఎంతో పేదరికం అనుభవిస్తూ కష్టపడి చదువుకొని దేశానికి గొప్ప నాయకుడిగా పేరుపొందాడన్నారు. పేద ధనిక భేదము లేకుండా ప్రతి కిందిస్థాయి కి చెందిన సామాజిక వర్గ ప్రజలు కూడా పరిపాలన చేయాలని ఉద్దేశంతో ఓటు హక్కును కల్పించి తద్వారా రిజర్వేషన్లు కల్పించినందుకే ఇవాళ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు ఉన్నత సామాజిక వర్గానికి చెందిన ప్రతి ఒక్కరు రిజర్వేషన్ ద్వారా ఎన్నో ఉన్నతమైన పదవులు అనుభవిస్తున్నారన్నారు.ఇది ఆయన భిక్షనే అంటూ అందుకనే ప్రతి గ్రామాలలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసుకొని ఆ మహనీయుని యువతి యువకులు విద్యావంతులు ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని వారు కోరారు. అంతేకాకుండా కాట్రపల్లి గ్రామంలో జరుగుతున్న ఈ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం పనులు పూర్తయినంతవరకు నా సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తానని మాట ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎదురబోయిన సూరయ్య, ఉప సర్పంచ్ చాగంటి యాదగిరి మరియు గ్రామ వార్డు సభ్యులు జల్లే మహేష్, కాలేపాక కృష్ణవేణి, పుట్ట ధనమ్మ, కొయ్యల లలిత, బొంత వెంకన్న, జాటోత్ నరేష్, భవాని గడ్డ గ్రామ సర్పంచ్ నునావత్ లక్ష్మణ్, కేసముద్రం మండల మున్సిపల్ కౌన్సిలర్ వల్లందాస్ ఉమా రవి , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వరావు, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి,మార్కెట్ మాజీ చైర్మన్ నీలం సువాసిని దుర్గేష్, చిలివేరు సమ్మయ్య గౌడ, బానోతు వెంకన్న, తరాల వీరేష్ యాదవ్, బానోతు బద్య,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు నజీర్ అహ్మద్ ,ఎల్ హెచ్ పి ఎస్ మండల అధ్యక్షులు హరినాయక్ ,అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కామ సంజీవరావు, ఎం ఎస్ పి జిల్లా నాయకులు గుగ్గిళ్ళ పీరయ్య, మాదిగ అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన జిల్లా కార్యదర్శి నిరుడు సామేలు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మందల కృష్ణమూర్తి ,అంబేద్కర్ యువజన సంఘం కేసముద్రం మండల అధ్యక్షులు వల్లందాస్ రవి, అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు పోలేపాక నాగరాజు, సోమరపు మదర్ , కాట్రపల్లి గ్రామ కాకతీయ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు నల్లగొప్పుల రాజేష్ ,ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కంటిపూడి అరుణ్ కుమార్, దండు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొమ్ము నాగరాజ్, మాల మహానాడు మండల నాయకులు బెజ్జం అంబేద్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షులు జల్లే జాన్సన్, జల్లె ప్రశాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లేయాకాంబరం ,జల్లే రవీందర్ ,మునిగే చిన్నబాబు, జల్లే కరుణాకర్ ,జల్లే అనిల్, జల్లె విజేందర్ ,సందేపాక జంపయ్య ,జల్లే సునయ్ , అంబేద్కర్ యువజన సంఘం పెద్దలు చిన్నలు యువకులు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.






## పదవ తరగతి పరీక్షలకు
# పటిష్ట బందోబస్తు

**పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (144) అమలు**
**వర్ధన్నపేట ఎస్ఐ సాయిబాబు**



**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 13,తరంగాలు :** పదవ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టింది.వెస్ట్ జోన్ డీసీపీ మహేంద్ర నాయక్ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ ( సెక్షన్ 144) అమలు చేస్తున్నట్లు ఎస్.ఐ ఎన్.సాయిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ?ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి ?పరీక్షా కేంద్రాల సమీపంలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒకచోట చేరకుండ,పరీక్షలు జరిగే సమయంలో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు లేదా ధర్నాలు నిర్వహించకూడదని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లు పరీక్ష ముగిసే వరకు మూసి ఉంచాలని ఆదేశించారు. వర్ధన్నపేట పరిధిలోని సెంటర్ నెంబర్ 199 ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెంటర్ నెంబర్ 240 ఫుస్కోస్ హై స్కూల్ పరీక్ష కేంద్రాలలో ఈ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయబడతాయని విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు వీలుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు , నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని , ?పరీక్షా కేంద్రాల వద్ద నిరంతరం పోలీసు గస్తీ ఉంటుందని తెలిపారు.విద్యార్థులకు, ఇన్విజిలేటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు వర్ధన్నపేట ఎస్.ఐ ఎన్. సాయిబాబు తెలిపారు.

## బాధితుడికి పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శ,ఆర్థిక సహాయం





**రాయపర్తి, మార్చి 13,తరంగాలు :**ప్రమాదంలో గాయపడ్డ బాధితుడిని ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు.వరంగల్ జిల్లా రాయపర్తి మండలం వెంకటేశ్వరపల్లి గ్రామంలో వార్డ్ నెంబర్ గద్దల యాకయ్య కుమారుడు గద్దల శోభన్ ఇటీవల ప్రమాదంలో గాయపడి, హాస్పిటల్ లో చికిత్స తీసుకోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుకున్న ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బాదితుది ఇంటికి వెళ్లి పరమార్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్,మండల పార్టీ నాయకులు గజావెల్లి ప్రసాద్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్త కుటుంబనికి అండగా
## ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

**రాయపర్తి, మార్చి 13,తరంగాలు :**పార్టీ కార్యకర్త కుటుంబనికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి నిత్యవసర సరుకులు పంపిణీ చేసి అండగా నిలిచారు.వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామంలో బీఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సంకినేని ఎల్లస్వామి అమ్మమ్మ గుండాల లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యుల పరామర్శించారు.అనంతరం ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక క్వింటా బియ్యం, ఆయిల్ క్యాన్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్,మండల పార్టీ



నాయకులు లిగజావెల్లి ప్రసాద్, సంధి దేవేందర్ రెడ్డి, పెరటి యాదవ రెడ్డి, ఈదులకాంటి సంపత్ రెడ్డి, లేతకుల యకూబ్ రెడ్డి స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు శుభాకాంక్షలు

**తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామాల సత్యం**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, మార్చి 13, తరంగాలు :** శనివారం నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పురస్కరించుకొని పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులందరికీ పూలే అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ నాయకుడు దామాల సత్యం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఏడాది పొడవునా కష్టపడి చదివిన విద్యార్థులు తమ ప్రతిభను పరీక్షల ద్వారా నిరూపించుకునే మంచి అవకాశం ఇదని తెలిపారు.విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకుని పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. సమయపాలన, ఏకాగ్రత మరియు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించి ఉన్నత విద్యలో రాణిస్తూ తమ తల్లిదండ్రులకు, గురువులకు మరియు సమాజానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షిస్తూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులందరికీ విజయాన్ని సాధించాలని దామాల సత్యం కోరారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక
## డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటిన అధ్యాపక బృందం

**వర్ధన్నపేట ప్రతినిధి,మార్చి 13, తరంగాలు :**వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం భాగంగా శుక్రవారం చెట్ల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పోషయ్య ఆధ్వర్యంలో అధ్యాపక బృందం కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పోషయ్య మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలను తూచా పాటించడం తమ ప్రధాన కర్తవ్యమని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఈ నెల ప్రారంభమైనప్పటి నుంచి కళాశాలలో ప్రతిరోజూ ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.అందులో భాగంగా ఒక రోజు కళాశాల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టగా, మరో రోజు కంప్యూటర్ సిస్టమ్స్



తదితర సామగ్రిని శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. శుక్రవారం అధ్యాపకుల సహకారంతో కళాశాల ప్రాంగణంలో చెట్ల నాటే కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అనేక కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమానికి సహకరించిన



అధ్యాపకులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తదితరులకు ప్రిన్సిపాల్ పోషయ్య ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.